క్లుప్తంగా

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి



విద్యార్థులు, వైద్యసిబ్బందితో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, తదితరులు

షాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పామెన జ్యోతీభీంభరత్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో చేవెళ్ల పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు, పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 310 మందికిపైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మద్దూరు మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్డాపూర్ రక్తమైసమ్మ దేవాలయంలో ఆమె కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు జ్యోతిభీమ్‌భరత్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకుడు అంజన్‌శాస్త్రీ పండిత్ ప్రత్యేక పూజలు నిర్వహించి వారిని సన్మానించారు.

చేవెళ్ల ఎస్‌ఐగా వనం శిరీష

చేవెళ్ల: సైబరాబాద్ పరిధిలో ఎస్‌ఐల బదిలీలలో భాగంగా మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి చేవెళ్లకు వనం శిరీష బదిలీ అయ్యారు. బుధవారం సైబరాబాద్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పలువురు ఎస్‌ఐల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వనం శిరీష చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అయితే చేవెళ్లలో ఇప్పటికే ఇద్దరు ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఉండగా ఆదనంగా శిరీషను కేటాయించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ట్రాఫిక్ సీఐ వెంకటేశం



అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

చేవెళ్ల: మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ వెంకటేశం హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా నడిపిన 12 వాహనాలను, మైనర్లు నడిపిస్తున్న మూడు వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి చేవెళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వాహనదారులు కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో డప్పు దరువు వేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టి ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. చేవెళ్లలో ఈ నెల 7వ తేదీన నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మద్దతుగా మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పుల దరువులతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని డప్పు దరువు వేసి వర్గీకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అసెంబ్లీలో బిల్లు పెట్టిందని చెప్పారు. వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మండల కేంద్రంలో డప్పుల దరువుతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ చేపట్టిన అనంతరం ఈనెల 7వ తేదీన నిర్వహించాల్సిన లక్ష డప్పుల ప్రదర్శన సభ వాయిదా పడినట్లు సమాచారం వచ్చింది.

పన్నుల వసూలుపై నజర్

- రూ.కోట్లలో బకాయిలు.. అధికారులకు సవాల్‌గా మారిన వైనం
- ఇప్పటికీ 30శాతం చేరుకోని వసూలు
- అప్రమత్తంగా లేకుంటే భారమే!



శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో పన్నుల వసూలు అధికారులకు సవాల్‌గా మారింది. దీనికి కారణం గతేడాది నుంచే పన్నులు రెట్టింపు కావడమే. పెరిగిన మొత్తాన్ని పురవాసులు కట్టడానికి ససేమిరా అనడంతో అధికారులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. దీంతో శంకర్‌పల్లి మున్సిపాలిటీలో దాదాపు రూ.3కోట్లకు పైగానే బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా అప్రమత్తంగా లేకుంటే మున్సిపాలిటీపై పెనుభారం పడే అవకాశం ఉంది. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో పన్నుల వసూలుపై కథనం.

రెట్టింపు పన్నులు.. ప్రజలపై భారం!

అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి పట్టణాన్ని 2018 ఆగస్టులో ఐదు గ్రామాల కలయికతో మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. 2020 జనవరి 25 నుంచి నూతన పాలకవర్గ పాలన అమలులోకి వచ్చింది. మున్సిపాలిటీలో పన్నులు మాత్రం 2023 వరకు గ్రామ పంచాయతీలోని రేట్లనే కొనసాగించారు. మున్సిపల్ యాక్టు ప్రకారం మూడేళ్ల తర్వాత మున్సిపాలిటీలకు అనుగుణంగా రేట్లు పెంచాల్సి రావడంతో పన్నుల రేట్లు అమాంతం రెండింతలు, మూడింతలు పెరిగాయి. ఈ పన్నులు ఏమిటని పలువురు మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులను నిలదీశారు. అప్పటి మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. పన్ను రేట్లు పాక్షికంగా తగ్గించనున్నట్లు గేజిట్ విడుదల చేయగా..దానిని మున్సిపల్ ఉన్నతాధికారులు ఆమోదం తెలుపలేదు.

సంవత్సరం	లక్ష్యం	వసూలు	శాతం
2023-24	5.36కోట్లు	2.31కోట్లు	43.13%
2024-25	6.98కోట్లు	1.80కోట్లు(సుమారు)	26%

ఇప్పటికీ.. 30శాతం చేరుకోని వసూలు

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో గతేడాది 2023-2024 వార్షిక పన్ను లక్ష్యం రూ.5కోట్ల 36లక్షలుగా అధికారులు పెట్టుకున్నారు. అయితే వసూలు మాత్రం కేవలం రూ.2కోట్ల 31లక్షలు మాత్రమే వచ్చాయి. దీంతో రూ. 3కోట్లకు పైగానే బకాయిలు పేరుకుపోయాయి. అయితే గతేడాది బకాయిలు, 2024- 2025 వార్షిక పన్ను లక్ష్యం రూ.6కోట్ల 98 లక్షలుగా అధికారులు నిర్ధారించారు. జనవరి 31నాటికి కనీసం 30శాతం సైతం వసూలు కాలేదు. వార్షిక గడువు ముగియడానికి ఇంకా రెండు నెలలే మిగిలి ఉన్నప్పటికీ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇదే విధానం కొనసాగితే భవిష్యత్‌లో మున్సిపల్ సిబ్బందికి సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితికి చేరుకోనుంది.

రెండు నెలల్లో పూర్తిచేస్తాం



రానున్న రెండు నెలల్లో 100శాతం పన్నులు వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటాం. దానికి అనుగుణంగా యాక్షన్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం చేసుకున్నాం. ప్రతి నిత్యం పన్నుల వసూళ్లతో పాటు వారానికి మూడు సార్లు రెవెన్యూ మేళా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా గత రెండు నెలలుగా వెనకబడిన మాట వాస్తవమే. త్వరలోనే నిర్ణీత లక్ష్యాన్ని పూర్తిచేస్తాం. బకాయిల్లో మినహాయింపునకు మున్సిపల్ అధికారుల నుంచి ప్రకటన కోసం వేచి చూస్తున్నాం. వస్తే సుమారు 60నుంచి 70శాతం వరకు పూర్తి అవుతుంది.

– యోగేశ్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

అంబేడ్కర్ కలలు సాకారం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత కలలు సాకారం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన భావితరాలకు గుర్తుండిపోతుందని కొనియాడారు. ఎస్సీల్లోని 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించాలన్న ప్రతిపాదనను శాసనసభ ఆమోదించిందన్నారు. దళితుల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను పక్కాగా నిర్వహించిందన్నారు. జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. కులగణన విషయంలో తీన్మార్ మల్లన్న మాటలు అర్థరహితమన్నారు. సమావేశంలో నాయకులు యాదయ్యయాదవ్, చంద్రశేఖర్, బాదేపల్లి సిద్దార్థ, బాల్‌రాజ్‌గౌడ్, జగన్, కొమ్ము కృష్ణ, నాగి సాయిలు, కరుణాకర్, శ్రీధర్, జాంగారి రవి, భాస్కర్, అంతయ్య, అనిల్, బస్వం, సీతారాం, మల్లేశ్, సత్తయ్య, జంగయ్య, రవి, భాస్కర్, ప్రభు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన అవసరం

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్



కమిషనర్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, వార్డు సభ్యులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో నాయకులు, యువకులు పారిశుధ్యంపై అవగాహన పెంపొందించుకొని ప్రజలు రోడ్లపై చెత్తను వేయకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. బుధవారం అజీజ్‌నగర్ మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కమిషనర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ముఖ్యంగా రోడ్లపై చెత్త వేయొద్దని, ప్రతి ఒక్కరూ చెత్త బండ్లలోనే వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జెమిల్, నాయకులు రాజుగోపాల్‌చారి, మహేందర్, డేవిడ్, వీరేశ్, ప్రణీత్, నర్సింహ్మాచారి, సాయిపీటర్, కంజర్ల రాజు, శ్యామ్‌సుందర్, బిట్టు, సురేందర్, మురళీ, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై ప్రచారాలు మానుకోవాలి

- మాజీ సర్పంచ్‌ల అరెస్టు అప్రజాస్వామికం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం నిర్వహిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీఎస్‌వై గార్డెన్‌లో బీజేపీ నాయకులు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో 420 హామీలను ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీజేపీపై విమర్శలు చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు.

ఎమ్మెల్యేను గ్రామాల్లో తిరగనివ్వం..

ఐదేళ్లుగా గ్రామానికి సేవలు చేసిన మాజీ సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్‌లు తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరితే పోలీసులతో అరెస్టులు చేయిస్తారా అన్నారు. మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులను చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆయన కోరారు. లేదంటే గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్‌లకు సంఘీభావం..

పెండింగ్ బిల్లుల కోసం చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లను మండల పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, సొంత పూచీకత్తుపైన విడుదల చేశారు. వీరిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి చాయ్‌పేచర్చ నిర్వహించి, సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులను ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వేరే అవసరాలకు వాడుకొని మాజీ సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే బీజేపీని ఆదరించాలని అయన కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సింహాయాదవ్, కుమ్మరి మహేశ్, నరేందర్‌రెడ్డి, మోహన్‌సింగ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్‌గౌడ్, ఐలన్న, రాజు, జైపాల్‌రెడ్డి, యాదయ్య, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్, చందు, పాండు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గద్దెదించడమే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం
- పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



షాబాద్‌లో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

షాబాద్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని గద్దె దించడమే బీజేపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కంజర్ల ప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేసే విధంగా ఉందని, ప్రధానంగా ఆదాయ పన్ను రూ.12 లక్షల వరకు సడలింపు చేయడం శుభ సూచికమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా 95 శాతం తెలంగాణకు లబ్ధి చేకూరుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పీసరి సతీశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య, మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, జిల్లా యువ మోర్చా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, నాయకులు తదితరులు ఉన్నారు.

శంకర్‌పల్లి చౌరస్తాలో..

శంకర్‌పల్లి: దేశం అతి కొద్ది కాలంలోనే ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన 2025-2026 కేంద్ర బడ్జెట్ పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉందంటూ బుధవారం శంకర్‌పల్లి చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం యువకుడు శ్రీకాంత్‌చారి తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వాసుదేవ్ కన్నా, నాయకులు బయానంద్, ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాములు, మాజీ ఎంపీపీ నర్సింహ, సురేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రమైన నందిగామలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బంటారం లక్ష్మణ్‌గౌడ్, చెన్నయ్య, మల్లేశ్, మండల బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌తో అన్ని వర్గాలకు మేలు'

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికి మేలు చూకూర్చే విధంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను హర్షిస్తూ ఆయన బుధవారం కొత్తూరు పట్టణంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పలువురు నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌సింగ్, హరికృష్ణ, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య



మాట్లాడుతున్న బాబయ్య, నాయకులు

షాద్‌నగర్: వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాబయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా ఉందన్నారు. దేశంలో ఉన్న అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. దేశాభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల నందు, అంబటి శివకుమార్, మహేశ్, పోగుల నర్సింలు, మొగిలి నర్సింలు, సారా అంజయ్య, శివకుమార్, వెంకటేశ్, రఘు, శ్రీకాంత్, భాను, శివ, రామకృష్ణ, సందీప్, ప్రవీణ్, గణేష్, అజయ్, కిరణ్, శివ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



పాఠశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న దాత

ఇబ్రహీంపట్నం రూరల్: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని, విద్యార్థుల శ్రేయస్సుకోసం ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గౌరీశంకర్ అనే వ్యక్తి రెండు స్టాండ్ ఫ్యాన్లు అందజేశారు. వీటిని బుధవారం ప్రధానోపాధ్యాయుడు పరమేష్‌తో పాటు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, బాషయ్య, రజిత పాల్గొన్నారు.

భయం వద్దు

పబ్లిక్ పరీక్షలు అంటే భయపడాల్సిన అవసరం లేదని మోటివేషనల్ స్పీకర్ మిరియాల రాజు అన్నారు. కొంగరకలాన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రేరణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేష్, ఉపాధ్యాయులు హరిప్రసాద్, పాండు ఉన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం

ఆమనగల్లు: కడ్తాల్ మండల పరిధి మక్తమాధారం గ్రామం శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారుజామున రథంపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి, ఆలయ నిర్వాహకులు వింజమూరి రామానుజచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని భక్తులు తాళ్లతో లాగుతూ ఊరేగించారు. ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, స్థానిక నాయకులు గోపాల్, సాయిలు, చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలు, ధ్వజస్తంభ ఊరేగింపులో పాల్గొన్న యాదవులు, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అజీజ్‌నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రతిష్ఠాపన చేయనున్న నూతన విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని వీధివీధిన ఊరేగింపు నిర్వహించారు. మల్లన్న స్వామి విగ్రహంతో పాటు గణపతి, భ్రమరాంబికాదేవి, గొల్లకేతమ్మ, ధ్వజస్తంభాలకు గ్రామంలోని మహిళలు నీటి బిందెలతో స్వాగతం పలికారు. ఊరేగింపులో యాదవులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ నెల 7వ తేదీన దేవాలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భూదాన్ రైతులకు న్యాయం చేయాలి



రైతులకు మద్దతుగా ధర్నాలో కూర్చున్న నాయకులు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్

నందిగామ: భూదాన్ బోర్డు ద్వారా భూములు పొందిన రైతులకు ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలోని అంబేడ్కర్ చౌరస్తాలో భూదాన్ భూముల రైతులు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి దేపల్లి అశోక్‌గౌడ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు బుధవారం హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. 1975లో భూదాన్ బోర్డు ద్వారా నందిగామకు చెందిన చాలామంది రైతులకు భూములను దానంగా ఇచ్చారని, అట్టి భూమికి ఓ వ్యక్తి తప్పుడు ఓఆర్సీలు సృష్టించి తన పేరుపై చేసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. బాధితులు గత కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా కూడా ఎలాంటి న్యాయం జరగడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా భూదాన్ భూముల రైతులకు న్యాయం చేయాలని లేని ఎడల ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్, మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నాయకులు చెన్నయ్య, హేమంత్, ప్రవీన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాధితులు శ్రీనివాస్, వెంకటయ్య, నర్సయ్య,యాదయ్య, చంద్రయ్య, పోచయ్య,అంజయ్య, కృష్ణ,నర్సింలు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఆచారి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లితండాకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సమక్షంలో, మాజీ కౌన్సిలర్ కృష్ణనాయక్ ఆధ్వర్యంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ కన్వీనర్ కర్నాటి విక్రంరెడ్డి, నాయకులు నర్సింహ, కృష్ణయాదవ్, లక్ష్మణ్, రవిరాథోడ్, పద్మప్రశాంత్, విష్ణుచారి పాల్గొన్నారు.